క్లుప్తంగా

ఖైసర్‌ఖాన్‌కు ఎమ్మెల్యే పరామర్శ



ఖైసర్‌ఖాన్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే, తదితరులు

కొండమల్లేపల్లి : కాంగ్రెస్ పార్టీ కొండమల్లేపల్లి పట్టణ అధ్యక్షుడు ఖైసర్‌ఖాన్‌ను దేవరకొండ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ ఆదివారం పరామర్శించారు. ఇటీవల ఖైసర్‌ఖాన్ భార్య అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో ఎమ్మెల్యే అతడిని పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వేమన్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు రమావత్ దస్రూనాయక్, బీఆర్ఎస్ నాయకులు లింగారెడ్డి, యుగేందర్‌రెడ్డి, రాజవర్ధన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, శేఖర్‌యాదవ్, శ్రీను పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలి



విద్యార్థులకు స్వెట్టర్లు పంపిణీ చేస్తున్న డాక్టర్ ఆనంద్

త్రిపురారం : చదువుకు పేదరికం అడ్డుకాదని, ప్రతి విద్యార్థి క్రమ శిక్షణతో చదువుకోవాలని డాక్టర్ ఆనంద్ అన్నారు. ఆదివారం మండలంలోని చౌళ్ల తండా, కాన్య తండా, రూప్ల తండా, హర్జ్య తండా గ్రామాల్లోని ప్రాథమికోన్నత పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు బంజారా మహిళా ఎన్‌జీఓ పౌండర్ డాక్టర్ ఆనంద్, హరిప్రియ సంయక్తుంగా స్వెట్టర్లు పంపిణీ చేశారు. అనంతరం విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అభయ ఆంజనేయ స్వామి వ్యవస్థాపకులు ఈసీ గోపాల్ సుజాత, గోవింద్, కృష్ణ, ప్రసాద్ పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత ఆధ్యాత్మిక గ్రంథం పంపిణీ



గ్రంథాలను పంపిణీ చేస్తున్న వెంకటేశం

పెద్దవూర : రథసప్తమి, యోగి వేమన జయంతిని పురస్కరించుకొని మండలంలోని చింతపల్లి గ్రామంలో ఆదిత్య గ్రంథం, వేమన పద్యాల నిగూఢ తత్వార్థ బోధిని, త్రైత సిద్ధాంత ఆధ్యాత్మిక గ్రంథాలను త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞానవేదిక నల్లగొండ జిల్లా అధ్యక్షుడు పడిగిమర్రి వెంకటేశం ఆదివారం పంపిణీ చేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మేకల శ్రీనివాస్, చక్రధర్, సైదులు, అశోక్, జంగయ్య, లింగస్వామి, కమలాకర్, ఆకాశ్, వెంకటమ్మ, శ్వేత, మమత పాల్గొన్నారు.

విద్యా అవకాశాలపై అవగాహన కల్పించాలి



అవగాహన కల్పిస్తున్న జగన్‌మోహన్‌రావు

మిర్యాలగూడ టౌన్ : భవిష్యత్ తరాలకు విద్యా అవకాశాలపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని హైదరాబాద్‌లోని గచ్చిబౌలి వాలీ ఓక జూనియర్ కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ జగన్ మోహన్‌రావు అన్నారు. ఆదివారం ఆ కళాశాల ఆధ్వర్యంలో పట్టణంలోని హౌసింగ్‌బోర్డులో విఘ్నేశ్వర ఎస్టేట్‌లో వివిధ కళాశాల విద్యార్థులకు నిర్వహించిన సెమినార్ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. జేఈఈ, నీట్, ఐఐటీలో సీటు దక్కించుకునే స్థాయిలో విద్యార్థులు తీర్చిదిద్దాలన్నారు. భావితరాలకు ఆదర్శంగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో అకాడమి వైస్ ప్రిన్సిపాల్ వినోద్, పీసీకే ప్రసాద్, రమేష్ తదితరులున్నారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి

డిండి : విద్యుదాఘాతంతో ఎద్దు మృతి చెందిన ఘటన మండల పరిధిలోని గోనకొల్ గ్రామ శివారులో ఆదివారం చోటుచేసుకుంది. వివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందిన తుమ్మల తిరుపతిరెడ్డి అనే రైతుకు సంబంధించిన ఎద్దు వ్యవసాయ పొలంలో మేత మేస్తుండగా ప్రమాదవశాత్తు పొలం వద్దనే ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ తీగలకు తగలడంతో కరెంట్ షాక్ గురై ఎద్దు అక్కడికక్కడే మృతిచెందింది. మృతి చెందిన ఎద్దు విలువ దాదాపు రూ. 50 వేలు ఉంటుందని రైతు పేర్కొన్నాడు.

విద్యార్థులకు స్నాక్స్ అందించరూ!

- అల్పాహారం అందించేందుకు ముందుకు రాని దాతలు
- ఆకలితో చదువుపై శ్రద్ధ చూపలేకపోతున్న విద్యార్థులు



పెద్దవూర జెడ్పీహైస్కూల్‌లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

పెద్దవూర : ఉత్తమ ఫలితాల సాధనే ధ్యేయంగా ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పదోతరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. అయితే వీరికి ఉదయం, సాయంత్రం వేళల్లో స్నాక్స్ అందించే దాతలు లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు. మండలంలో 9 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలలో 200 మందికి పైగా పదో తరగతి చదువుతున్నారు. అయితే ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలలో జిల్లా విద్యాశాఖ అధికారి ఆదేశానుసారం వంద రోజుల ప్రత్యేక ప్రణాళికను అమలు చేయాలని ఆదేశించింది. దీంతో పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులను ఉదయం 8:30 నుంచి 9:30 వరకు, అలాగే సాయంత్రం 4:45 నుంచి 5:45 వరకు పాఠశాల పనిదినం తర్వాత ప్రత్యేక తరగుతులు నిర్వహిస్తున్నారు. దీనికోసం మారుమూల గ్రామాల్లోని విద్యార్థులు ఉదయం 7 గంటలకే ఇళ్లనుంచి బయలుదేరి, ఆయా గ్రామాల స్టేజీల వరకు నడిచి వచ్చి అక్కడినుంచి బస్సుల్లో పాఠశాలకు రావాల్సిన పరిస్థితి నెలకొంది. నిత్యం వ్యవసాయ పనులకు వెళ్లే తల్లిదండ్రులు ఆ సమయానికి తమ పిల్లల కోసం వంటలు వండాల్సిన పరిస్థితి ఉంది. దీనికి తోడు ఆ సమయంలో విద్యార్థులు భోజనాలు చేయలేక ఖాళీ కడుపుతో పాఠశాలలకు వస్తున్నారు. మధ్యాహ్న భోజనం చేశాక విద్యార్థులు సాయంత్రం 6:30 గంటల వరకు పాఠశాలల్లోనే ఉండటంతో ఆకలికి తట్టుకోలేక నీరసించి చదువుపై శ్రద్ధ పెట్టలేకపోతున్నారు.

ముందుకురాని దాతలు

ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక తరగతులు ప్రారంభించిన ప్రభుత్వం విద్యార్థులకు స్నాక్స్ అందించలేమంటూ చేతులెత్తేసింది. దాతలు, స్వచ్ఛంద సంస్థలు, ఎన్‌ఆర్‌ఐలు, ప్రజాప్రతినిధులు, వ్యాపారులు, పూర్వవిద్యార్థులు ముందుకు వచ్చి విద్యార్థులకు స్నాక్స్(అల్పాహారం) అందించాలని సూచించింది. కాని ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు వారి వద్దకు వెళ్లి విద్యార్థులకు స్నాక్స్ అందించాలని వేడుకుంటున్నా ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో కొందరు దాతలు ముందుకు రాగా ఈ సారి మాత్రం దాతల దాతృత్వం కరువైంది. దీంతో విద్యార్థులు సాయంత్రం పూట నుంచి నీరు తాగి కడుపు మాడ్చుకుంటున్నారు. వ్యక్తిగత ప్రచారం, హంగూ ఆర్భాటాల కోసం రూ.లక్షలు ఖర్చుపెట్టే ప్రజా ప్రతినిధులు విద్యార్థులకు స్నాక్స్ అందిస్తే పుణ్యంతో పాటు విద్యార్థులు, వారి తల్లిదండ్రుల హృదయాల్లో స్థానం సంపాదించుకునే అవకాశమూ ఉంటుంది.

సాయంత్రం చాలా ఆకలేస్తుంది



ఉదయం 8 గంటలకు పాఠశాలకు వచ్చి సాయంత్రం 6:30 గంటల దాకా పాఠశాలల్లోనే ఉండాల్సి వస్తుంది. సాయంత్రం చాలా ఆకలేస్తుంది. మంచినీళ్లు తాగి సరి పెట్టుకుంటున్నాం. ప్రభుత్వం, దాతలు స్పందించి ఉదయం, సాయంత్రం స్నాక్స్ అందిస్తే పాఠశాల సమయంలో కంటే స్టడీ అవర్స్‌లో బాగా చదువుతాం.

– వి.శృతి, పదో తరగతి విద్యార్థిని, జెడ్పీహెచ్‌ఎస్ పెద్దవూర

చదువుపై శ్రద్ధ పెట్టలేకపోతున్నాం



ప్రత్యేక తరగతులతో ఉపాధ్యాయులు సబ్జెక్టుల వారీగా వచ్చి ఉదయం, సాయంత్రం వేళల్లో ఉపాధ్యాయులు దగ్గరుండి సందేహాలను నివృత్తి చేస్తూ ప్రోత్సహిస్తున్నారు. ప్రణాళిక బద్ధంగా చదివిస్తుండటంతో పదో తరగతిలో మంచి మార్కులు సాధిస్తామనే ధీమా ఏర్పడింది. కాని సాయంత్రం 6:30 గంటల దాకా తరగతులు ఉండటంతో ఆకలి వేస్తుంది. దీంతో చదువుపై శ్రద్ధ పెట్టలేకపోతున్నాం.

– రనిల్, విద్యార్థి

దాతలు ముందుకు రావాలి



పదో తరగతిలో వందశాతం ఫలితాల సాధనే లక్ష్యంగా వంద రోజుల ప్రణాళికను అమలు చేస్తున్నాం. సాయంత్రం పొద్దుపోయేదాకా పాఠశాలల్లోనే ఉంటుండటంతో ప్రత్యేక తరగతుల సమయంలో విద్యార్థులు ఆకలితో అలమటిస్తూ నీరసించి చదువుపై శ్రద్ధ పెట్టలేకపోతున్నారు. ప్రత్యేక తరగతుల సమయంలో విద్యార్థులకు స్నాక్స్ అందించేందుకు దాతలు ముందుకు రావాలి.

– కె.శ్రీనివాస్, హెచ్‌ఎం, జెడ్పీహెచ్‌ఎస్

అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- సాగర్ ఎమ్మెల్యే భగత్

హాలియా : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తుందని ఎమ్మెల్యే నోముల భగత్ అన్నారు. తిరుమలగిరి (సాగర్) మండలంలోని చింతలపాలెం గ్రామానికి చెందిన పలువురు బీజేపీ కార్యకర్తలు ఆదివారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే నోముల భగత్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా పార్టీ చేరిన వారికి బీఆర్ఎస్ కండువాలు కప్పి పార్టీలోకి ఎమ్మెల్యే ఆహ్వానించి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ చేపడుతున్న పలు అభివృద్ధి సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పలువురు పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు. రానున్న రోజుల్లో జాతీయ రాజకీయాల్లో బీఆర్ఎస్ పార్టీ క్రియాశీలక పాత్ర పోషించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధే దేశమంతా ఆచరిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు పిడిగం నాగయ్య, బీఆర్ఎస్ పార్టీ నాయకులు బిక్షా నాయక్, హరికృష్ణ, పెద్దిరాజు సర్పంచ్‌లు వస్త్రపురి రామలింగయ్య, పురుషోత్తం, ఎంపీటీసీలు బార్గవి శ్రీనివాస్ రెడ్డి, పెద్దమాను కాశయ్య, మండల ప్రధాన కార్యదర్శి తిరుమల్, యూత్ అధ్యక్షుడు రమేష్ నాయక్, గుండాల కృష్ణ, వీరబోయిన మల్లిఖార్జున్, రామరాజు, ఇమామ్ ఖాసీం, వెంకటేశ్వర్లు, శివకృష్ణ, గోవింద్ తదితరులు ఉన్నారు.



పార్టీలో చేరిన వారికి బీఆర్ఎస్ కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే భగత్

విజ్ఞానాన్ని పెంచుకుంటేనే విజయం

ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు విజ్ఞానాన్ని పెంపొందించుకుంటేనే విజేతలుగా నిలుస్తారని నాగార్జున సాగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే నోముల భగత్ అన్నారు. పట్టణంలోని టైం స్కూల్‌లో శనివారం రాత్రి నిర్వహించిన ఐదో వార్షికోత్సవం సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు పలువురిని విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పార్వతమ్మశంకరయ్య, ఎంఈఓ బాలునాయక్, డాక్టర్ రవీందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ సుధాకర్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గౌనీ రాజారమేష్ యాదవ్, కౌన్సిలర్ ప్రసాద్‌నాయక్, మార్కెట్ డైరెక్టర్ సురభి రాంబాబు, టైం స్కూల్ డైరెక్టర్లు నరేందర్‌రెడ్డి, కోటిరెడ్డి, నర్సిరెడ్డి, నాయకులు అన్వరుద్దీన్, మొగలయ్య, యల్లయ్య, సైదాచారి ఉన్నారు.

యోగాతో విద్యార్థుల్లో ఆలోచనా శక్తి మెరుగు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కోటిరెడ్డి

మిర్యాలగూడ టౌన్ : యోగాతో విద్యార్థుల్లోని మానసిక ఒత్తిడి తగ్గి ఆలోచనా శక్తి పెరుగుతుందని ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో లిటిల్‌ఫ్లవర్ హైస్కూల్ ఆధ్వర్యంలో యోగా ప్రదర్శనను నిర్వహించారు. ఈ ప్రదర్శనకు ఆయన ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. హౌసింగ్‌బోర్డులోని లిటిల్‌ఫ్లవర్ హైస్కూల్ వారు ఇలాంటి కార్యక్రమాలను నిర్వహించడం వలన పిల్లల్లో శారిరక, మానసిక ఒత్తిడి తగ్గి, చదువులతో పాటు ఇతర అంశాలపై జ్ఞాపకశక్తిని పెంపొందించకుంటారన్నారు. యోగా భారత సనాతన సాంప్రదాయం అని, దానిని భావితరాలకు అందించాలన్నారు. ఇలాంటి బృహత్తరమైన కార్యక్రమం చేపట్టడంపై పాఠశాల యాజమాన్యం యోగా శిక్షకుడు టి. వినోద్‌చంద్రన్‌లు మరిన్ని నిర్వహించాలన్నారు. పాఠశాలల్లో సిలబస్‌లు కూడా ఒక పాఠ్యంశంగా చేర్చి, పిల్లలకు అనునిత్యం యోగా శిక్షణ ఇవ్వాలని, అందుకు ప్రభుత్వ పరంగా తనవంతు కృషి చేస్తానన్నారు. అనంతరం పాఠశాల యాజమాన్యాన్ని అతడు ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి ఎం. బాలాజీనాయక్, వార్డు కౌన్సిలర్ డి. రవినాయక్, సోషల్ ఆర్గనైజర్ మునీర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కెకె జయరాజన్, ప్రభుత్వ వ్యాయమ ఉపాధ్యాయుడు వెంకటేశ్వర్లు, శ్రీపతి శ్రీనివాస్, గూడపూరి లక్ష్మణ్, పరంగి రాము తదితరులున్నారు.

ఉద్యోగుల సమస్య పరిష్కారానికి కృషి చేస్తా

మిర్యాలగూడ టౌన్ : తెలంగాణాలో బీసీ ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి తన వంతుగా కృషి చేస్తానని ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి అన్నారు. ఆదివారం బీసీ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ముద్రించిన 2023 నూతన సంవత్సర క్యాలెండర్‌ను తన నివాసంలో ఆవిష్కరించి మాట్లాడారు.ఈ కార్యక్రమంలో బీసీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు రాపోలు పరమేశ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు సైదులు ముదిరాజ్, బంజార ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు మాలోతు దశరథనాయక్, బీసీ ఉపాధ్యాయ సంఘం నియోజకవర్గ ఇన్‌చార్జ్ శ్రీనివాసాచారి, బీసీ ఉద్యోగుల సంఘం నాయకులు నాగవల్లి ఉపేందర్, శ్రీనివాస్ యాదవ్, రాపోలు భాస్కర్, డాక్టర్ సత్యనారాయణ, రచ్చ వెంకటేశ్వర్లు, చంద్రశేఖర్, కందరబోయిన నాగరాజు, మురళియాదవ్, జయరాజు పాల్గొన్నారు.

అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా పథకాలు

దేవరకొండ : సీఎం కేసీఆర్ అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా పథకాలను ప్రవేశపెట్టినట్లు ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. ఆదివారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో పీఏపల్లి మండల నక్కల పెంటతండా సర్పంచ్ రవీందర్, బాలాజీ నగర్ ఉపసర్పంచ్ కవితపాండులతో పాటు మరికొంతమంది ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు.ఈ సందర్భంగా పార్టీలోకి చేరిన వారికి ఎమ్మెల్యే కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వివిధ పార్టీల నుంచి బీఆర్ఎస్‌లో చేరుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ వంగాల ప్రతాప్‌రెడ్డి, అర్వపల్లి నర్సింహా, బస్సీలాల్, నగేశ్, స్వామినాయక్, శ్రీనివాస్, కర్నాటి రవి, కర్ణయ్య, జబ్బార్ తదితరులు పాల్గొన్నారు.



పార్టీలో చేరుతున్న వారికి గులాబీ కండువాలు కప్పుతున్న ఎమ్మెల్యే రవీంద్రకుమార్

దేశభక్తిని పెంపొందించుకోవాలి

దేవరకొండ : యువత దేశభక్తిని పెంపొందించుకోవాలని ఆర్ఎస్ఎస్ ప్రాంత కార్యకారిణి సభ్యుడు అన్నదానం సుబ్రమణ్యం అన్నారు. ఆదివారం దేవరకొండ పట్టణంలో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్(ఆర్ఎస్ఎస్) ఆధ్వర్యంలో విరాట్ హిందూ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ముందుగా పట్టణంలోని బాలుర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు రూట్ మార్చ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అనీల్‌రెడ్డి, వెంకటయ్య, నగర సంఘ చాలక్ సుదర్శన్, జనార్దన్, శేఖర్, సంతోష్‌రెడ్డి, శ్రావణ్, నాగరాజు పాల్గొన్నారు.

వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

కొండమల్లేపల్లి : ప్రజలు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కొండమల్లేపల్లి జెడ్పీటీసీ పస్నూరి సరస్వతమ్మ, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి యుగేందర్‌రెడ్డి, దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్‌వీటిలు అన్నారు. దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కొండమల్లేపల్లి జెడ్పీటీసీ పస్నూరి సరస్వతమ్మ సౌజన్యంతో ఆదివారం కొండమల్లేపల్లిలోని నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు. హెల్త్ క్యాంప్‌లో సుమారు 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు వారు తెలిపారు. ఈ వైద్య శిబిరంలో వైద్యులు నిఖిత, స్వప్న, మనో చరణ్, తీర్థారాణి, అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి తాళ్ల శ్రీధర్‌గౌడ్, కృష్ణకిశోర్, ఉమా మహేశ్, లింగారెడ్డి, ఎం.శ్రీనివాస్‌యాదవ్, యాదగిరి, వెంకట్‌రెడ్డి, కాశయ్య, శ్రీనివాస్‌యాదవ్, దస్రూ, తాళ్ల సురేష్, క్రాంతి, రమేశ్, శ్రీను, జగన్, భీమ్‌సింగ్, రాము, సాయి, శివ, కృష్ణ, ఆంజనేయులు, ఖాజా, శ్రీను, మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉగాదిలోపు మిర్యాలగూడను జిల్లాగా ప్రకటించాలి

మిర్యాలగూడ అర్బన్ : ఉగాది పండుగలోపు మిర్యాలగూడను జిల్లాగా ప్రకటించాలని మాజీ ఎమ్మెల్యే రేపాల శ్రీనివాస్ అన్నారు. ఆదివారం స్థానిక అమరవీరుల స్థూపం వద్ద ఏర్పాటు చేసిన జిల్లా ఉద్యమ కారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా ఏర్పాటుకు కావలసిన అన్ని అర్హతలు మిర్యాలగూడకు ఉన్నాయని, ప్రజల ఆకాంక్ష ప్రజల్లో బలంగా ఉందని ముఖ్యమంత్రి చొరవ తీసుకుని జిల్లా ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. స్థానిక ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు, ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డిలు ప్రభుత్వం ఒత్తిడి తేవాలని కోరారు. జిల్లా ఏర్పాటు ఉద్యమంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని, జిల్లా ఏర్పాటుతోనే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. అనంతరం కరాటే విద్యార్థులకు జిల్లా ఏర్పాటు ఆవశ్యకతపై అవగాహనప కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సాధన సమితి నాయకులు చేగొండి మురళి యాదవ్, నాయకులు రమేష్, మనోజ్, వేణుగోపాల్‌రెడ్డి, సోమయ్య, రామయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రేపాల శ్రీనివాస్

క్రీడలతో మానసిక ఉల్లాసం

పెద్దవూర : క్రీడలతోనే మానసిక ఉల్లాసం కలుగుతుందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సాదం సంపత్ కుమార్ అన్నారు. మండలంలోని తుంగతుర్తి గ్రామపంచాయతీలో ఏర్పాటు చేసిన యూత్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. గ్రామీణ క్రీడలతో స్నేహభావం పెంపొందుతుందన్నారు. క్రీడల్లో గెలుపు, ఓటములు సర్వసాధారమని, ఓటమి చెందిన జట్టు గెలుపుకోసం పోరాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ గుంటుక వెంకట్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు రవి నాయక్, రాష్ట్ర నాయకులు కర్ణ బ్రహ్మరెడ్డి, స్థానిక సర్పంచ్ సైదులు విష్ణుప్రియ, నరేష్ నాయక్, వెంకట్‌రెడ్డి, ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తల కుటుంబాలను ఆదుకుంటాం

మిర్యాలగూడ : ఆపదలో ఉన్న బీజేపీ కార్యకర్తల కుటుంబాలను పార్టీ ఎల్లవేళలా ఆదుకుంటుందని పార్టీ రాష్ట్ర నాయకురాలు, సినీ నటి కవిత అన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు చిర్ర సాంబమూర్తి కుమార్తె తపస్వి బోన్ కేన్సర్‌తో బాధపడుతుండగా ఇటీవల మండలంలో నిర్వహించిన పార్టీ సమావేశంలో విషయం తెలుసుకున్న కవిత పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన బండి సంజయ్ పాప చికిత్సకు అవసరమైన ఆర్థిక సాయాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. దీనిలో భాగంగా హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తపస్వి చికిత్స కోసం రూ.4లక్షలను పాప కుటుంబ సభ్యులకు కవిత అందజేశారు. అనంతరం పాప ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు.

ముగిసిన లక్ష్మీనర్సింహస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు



రథాన్ని లాగుతున్న భక్తులు



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

పెద్దఅడిశర్లపల్లి : మండలంలోని మేడారంలో ఐదు రోజులుగా నిర్వహిస్తున్న శ్రీ లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. చివరిరోజున ఆదివారం తెల్లవారుజామున రథోత్సవంలో భక్తుల అధిక సంఖ్యలో పాల్గొని రథాన్ని లాగారు. చివరి రోజున నిత్య హోమం, మహాపూర్ణాహుతి, ద్వాదశఘనం, దేవతోద్వాసన, పవళింపు సేవతో బ్రహ్మోత్సవాలు ముగిశాయి. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ పోషంరెడ్డి హనుమారెడ్డి, ఆలయ ధర్మకర్త తెరటిపల్లి విఠల్, సర్పంచ్ కాలుసాని అరుణప్రభాకర్‌రెడ్డి, ఎంపీటీసీ నక్క రాములు, సూర్యనారాయణమూర్తి, ఆలయ కమిటీ సభ్యులు జనార్దన్‌రెడ్డి, జాన్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, రంగారెడ్డి పాల్గొన్నారు.

సీపీఎం సీనియర్ నాయకుడు మహమూద్‌కు నివాళి

మిర్యాలగూడ అర్బన్ : సీపీఎం సీనియర్ నాయకుడు ఎండీ.మహమూద్(65) అనారోగ్యంతో శనివారం రాత్రి మృతిచెందాడు. ఆయన మృతి చెందిన విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, ఆయన నివాసానికి చేరుకుని సంతాపం ప్రకటించారు. మహమూద్ మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీపీఎం అభివృద్ధికి మహమూద్ చేసిన సేవలు మరువలేనివని, విద్యార్థి దశనుంచే ఎర్రజెండా బాటలో నడిచారని విద్యార్థి నాయకుడిగా, కౌన్సిలర్‌గా ఆయన చేసిన సేవలు గుర్తు చేశారు. పరామర్శించిన వారిలో పార్టీ నల్లగొండ, సూర్యాపేట జిల్లాల కార్యదర్శులు ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, మల్లు నాగార్జున, రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేష్, జగదీష్‌చంద్ర, వీరేపల్లి వెంకటేశ్వర్లు, రవినాయక్, మల్లు గౌతంరెడ్డి, బావండ్ల పాండు, కౌన్సిలర ఎం.ఎ.ఘని, రామ్మూర్తి, పరశురాములు, ఆయూబ్, తదితరులు పాల్గొన్నారు.



మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, తదితరులు

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



నాటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

నిడమనూరు: నిడమనూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 1988–89 పదవ తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం సమ్మేళనమయ్యారు. ఈ సందర్భంగా వారంతా నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకుని, ఒకరి నొకరు ఆటపట్టించుకుంటూ సరదాగా గడిపారు. నాటి ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో నాటి ప్రధానోపాధ్యాయుడు యుగంధర్‌రెడ్డి, ఉపాధ్యాయులు కుబేరుడు, నర్సింహ, రంగారెడ్డి, పూర్వ విద్యార్థులు భీమయ్య, శ్రీనివాసులు, ఉపేందర్, ప్రకాష్, నిర్మళ, విజయలక్ష్మి, నాగలక్ష్మి, సుజాత, కృష్ణమోహన్, శ్రీనివాస్, వినయ్, గోవర్ధన్, పంకజ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ గ్రామ కమిటీల ఎన్నిక

త్రిపురారం : మండలంలోని రాగడపలో కాంగ్రెస్ గ్రామ కమిటీని త్రిపురారం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ముడిమళ్ల బుచ్చిరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఎన్నుకున్నారు. రాగడప కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడిగా చుక్క లక్ష్మణ్, భూత్ కమిటీ అధ్యక్షుడిగా గట్టిగోర్ల పెద్దులు, బొల్ల వెంకటేశ్వర్లు, రైతు సంఘం అధ్యక్షుడిగా పులి కృష్ణయ్య, సోషల్ మీడియా అధ్యక్షులుగా రషీద్, యువజన కమిటీ అధ్యక్షులుగా బోల్లం సైదులు, మహిళ అధ్యక్షులుగా బుర్రి కాశమ్మ, బీసీ సెల్ అధ్యక్షులుగా మొండికత్తి నాగరాజు, గౌరవ అధ్యక్షులుగా శిరసవాద లింగయ్య, మైనార్టీ అధ్యక్షులుగా షేక్ ముస్తాఫా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ఎంపీపీ గౌరవ సలహాదారు అనుముల శ్రీనివాస రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ బిట్టు రవి కుమార్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ధనావత్ భాస్కర్ నాయక్, అనుముల వెంకట్ రెడ్డి, ఆలంపల్లి జానయ్య, ధనావత్ వెంకట్రాం ఉన్నారు.

చింతపల్లి : చింతపల్లి మండల పరిధిలోని బోటిమీదితండా, పాలెం తండా, మధనాపురం, చాకలిశేరిపల్లి గ్రామాల్లో ఆదివారం కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటిలను మండల అధ్యక్షుడు అంగిరేకుల గోవర్ధన్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బోటిమీదితండా గ్రామ శాఖ అధ్యక్షుడిగా నేనావత్ జవహర్, ప్రధాన కార్యదర్శిగా బాణావత్ శ్రీకాంత్, కోశాధికారిగా నేనావత్ గోపాల్, పాలెంతండా గ్రామ శాఖ అధ్యక్షుడిగా సభావత్ శంకర్, ప్రధాన కార్యదర్శిగా ఇస్లావత్ నర్సింహా, కోశాధికారిగా ఇస్లావత్ రెడ్యా, మధనాపురం గ్రామ శాఖ అధ్యక్షుడిగా మాదగోని వెంకటయ్య, ప్రధాన కార్యదర్శిగా పడాల జంగయ్య, కోశాధికారిగా దేరంగుల యాదగిరి, చాకలిశేరిపల్లి గ్రామ శాఖ అధ్యక్షుడిగా బూడిద చిన వెంకటయ్య, ప్రధాన కార్యదర్శిగా మద్దెల శ్రీను, కోశాధికారిగా బాలగోని యాదయ్యలను ఎన్నుకున్నారు.



త్రిపురారం : రాగడప గ్రామ కమిటీ సభ్యులకు నియామక పత్రం అందజేస్తున్న నాయకులు

మూల విరాట్‌కు జలాభిషేకం

అడవిదేవులపల్లి : మండల కేంద్రంలోని శ్రీస్వయంభూ మైషాసురమర్ధిని అమ్మవారి పునః ప్రతిష్ఠాపన మహోత్సవంలో భాగంగా ఆదివారం రెండో రోజు వేదస్వస్తీ, చండీ రుద్రపారాయణం, మంత్రవాహనాలు, హారతి మంత్ర పుష్పం వంటి కార్యక్రమాలను నిర్వహించిన అమ్మవారికి ఆలయ ప్రధాన అర్చకులు వెలూటూరి రాంమోహన్ దంపతులు ఆధ్వర్యంలో కృష్ణానది నుంచి తీసుకవచ్చిన జలంతో అభిషేకాలను నిర్వహించారు. అదే విధంగా గ్రామంలోని ప్రతి ఇంటి నుంచి తీసుకువచ్చిన జలంతో మూలవిరాట్‌కు జలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జగన్‌మోహన్ శర్మలతో ఆలయ నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.



జలాభిషేకం చేస్తున్న ప్రధాన అర్చక దంపతులు